సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

11నుంచి కొండపైకి ఆటోలు

- అనుమతి.. నిబంధనలు తప్పనిసరి
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి6 : యాదగిరి గుట్ట కొండపైకి ఈ నెల 11 నుంచి ఆటోలకు అనుమతినిస్తున్నట్లు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వెల్లడించారు. కొండపైకి అనుమతి ఇవ్వాలంటే నిబంధనలు తప్పనిసరి అని, 10 రోజులపాటు పరిశీలించి విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని తెలిపారు. యాదగిరి కొండపైన వీవీఐపీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ హన్మంతు జెండగే, డీసీపీ రాజేశ్ చంద్ర, ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్తతో కలిసి మంగళవారం ఆయన సమీక్ష జరిపారు. కొండపైన కావాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపైకి వెళ్లే ఆటోలో ముగ్గురు ప్రయాణికులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఆటో డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు డ్రెస్‌కోడ్ తప్పనిసరి తెలిపారు. మద్యం సేవించి ఆటోను నడిపిస్తే అనుమతిని రద్దు చేస్తామన్నారు. రోజుకు కేవలం 100 ఆటోలు మాత్రమే కొండపైకి అనుమతి ఉంటుందని, ఉదయం 50, సాయంత్రం 50 ఆటోలను కొండపైకి నడిపించాలని చెప్పారు. ప్రతి ఆటోకు స్వామివారి చిత్రపటంతోపాటు ఐడీ నంబర్ ఉంటుందన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సులను తగ్గించే ప్రసక్తేలేదని తెలిపారు. కొండపైన త్వరలో భక్తులు నిద్రించేందుకు వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు, కొబ్బరికాయ కొట్టు ప్రాంతాన్ని సైతం ఎంపిక చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఏసీపీ శివరామకృష్ణారెడ్డి, సీఐ రమేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య, వైటీడీఏ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈఈ రామారావు, ట్రాఫిక్ సీఐ లింగయ్య, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓ గట్టు శ్రవణ్‌కుమార్, గజవెల్లి రఘు, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ ఆయా శాఖలతో అధికారులు పాల్గొన్నారు.

ఆందోళ్‌మైసమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.14లక్షలు

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని దండు మల్కాపురం గ్రామ పరిధిలోని ఆందోళ్‌మైసమ్మ దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి నల్లగొండ జిల్లా సహాయ కమిషనర్ కె.మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో 134 రోజుల హుండీని లెక్కించారు. 14,00,607 రూపాయల ఆదాయం వచ్చినట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.మొహన్‌బాబు తెలిపారు.

కార్యక్రమంలో దేవాలయ అర్చక సిబ్బంది, దుర్గాశివశక్తి సాయి సేవాసమితి, ఏపీజీవీబీ సిబ్బంది పాల్గొన్నారు.

పనిలో నైపుణ్యం కోసం సిబ్బందికి శిక్షణ

- డీజీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రాహుల్ హెగ్డే

డీజీపీ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 6 : పనిలో నైపుణ్యం కోసం పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. మంగళవారం డీజీపీ రవిగుప్తాతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సైబర్ మోసాలు, కేసుల స్థితిగతులు, కమ్యూనిటీ కార్యక్రమాలు, మహిళల రక్షణ, సాంకేతికత, ఆధునిక పోలీసింగ్ తదితర అంశాలపై డీజీపీ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. ఫిర్యాదులపై స్పందన, సైబర్ మోసాల దర్యాప్తు, రోడ్డు భద్రత చర్యలు, కేసుల దర్యాప్తు స్థితిగతులపై టీమ్ వర్క్ చేస్తూ ప్రణాళికతో పని చేస్తున్నామని వివరించారు. ప్రతి పనిపై డీఎస్పీ, సీఐ స్థాయి ఇన్‌చార్జి అధికారులు, వర్టికల్ మానిటరింగ్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నట్లు డీజీపీకి వివరించారు.

సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజేశ్, సీఐలు శివశంకర్, రామలింగారెడ్డి, అశోక్, మురారి, వీరరాఘవులు, రాము, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ వెంకయ్య పాల్గొన్నారు.

నేడు మంత్రుల రాక

- ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులపై సమీక్ష
- కోదాడలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన

హుజూర్‌నగర్‌లో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి తదితరులు

నేరేడుచర్ల/హుజూర్‌నగర్, ఫిబ్రవరి 6 : హుజూర్‌నగర్, కోదాడలోని ప్రభుత్వ ఆస్పత్రులను పరిశీలించి మౌలిక వసతుల కల్పనపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించేందుకు బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రానున్నారు. హుజూర్‌నగర్‌లోని 100 పడకల ఆస్పత్రిని పరిశీలించి వైద్యాధికారులతో మౌలిక వసతులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. కోదాడలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఉదయం 9:30 గంటలకు మినిస్టర్స్ క్వార్టర్స్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 10:45 గంటలకు హుజూర్‌నగర్‌కు చేరుకుంటారు. 11 నుంచి 12:30 గంటల వరకు హుజూర్‌నగర్‌లోని 100 పడకల దవాఖానను పరిశీలిస్తారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 12:45 నుంచి 1:15 వరకు కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భోజన విరామం ఉంటుంది. 1:30 తరువాత కోదాడలో 100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక వసతులపై సమీక్ష సమావేశం నిర్వహించి 3:15 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతారు. మంత్రుల పర్యటన సందర్భంగా హుజూర్‌నగర్, కోదాడలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి.. ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డీఎస్పీ ప్రకాశ్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి

వలిగొండ, ఫిబ్రవరి 6 : గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వలిగొండ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన రేగు రామనర్సు (55) మండల కేంద్రంలో మోటర్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్న రామనర్సు మంగళవారం తెల్లవారుజామున ఇంటి నుంచి మోటర్ సైకిల్‌పై బయల్దేరాడు. ఉదయం వలిగొండ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై మృతదేహాన్ని గుర్తించిన రైల్వే సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి రైలు ఢీకొని మృతిచెందినట్లు నిర్ధారించారు. వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి : సీపీఐ

గరిడేపల్లి, ఫిబ్రవరి 6 : ఆయకట్టు పరిధిలో పొలాలను కాపాడేందుకు సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపి కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల్లో పంటలు చేతికందనున్న తరుణంలో పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు.

పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి పేరున నీటిని విడుదల చేసినట్లు అన్ని మేజర్లకు సాగర్ నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని కోరారు.

ఉద్యోగులు విధిగా ఐటీటీడీఎస్ చేయించుకోవాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

ఉద్యోగులకు ఐటీటీడీఎస్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, ఫిబ్రవరి 6 : ఉద్యోగులు విధిగా ఐటీటీడీఎస్ చేయించుకోవాలని కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఐటీటీడీఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు ఆదాయపు పన్ను చెల్లింపుతోపాటు టీడీఎస్ చేయించుకోవాలన్నారు. ముందుగా ఆదాయపు పన్నును 12 నెలలుగా విభజించి ప్రతి నెలా వేతనం ద్వారా ఆదాయపు పన్ను శాఖకు చెల్లించి తదుపరి ప్రతి త్రైమాసానికి టీడీఎస్ 24క్యూ చెల్లించుకోవాలన్నారు. ఆదాయపు పన్ను చెల్లించి టీడీఎస్ చేయించుకోకపోతే రోజుకు రూ.200 అపరాధ రుసుముకు సంబంధించి నోటీసులు అందించనున్నట్లు తెలిపారు. డీడీఓలు ఫామ్-16ను ఆన్‌లైన్ ద్వారానే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆదాయపు పన్ను పరిధిలో ఉన్న ప్రతి ఉద్యోగి విధిగా ఫిబ్రవరి వేతనంలో పన్ను మినహాయింపు చేసి ఆదాయపు పన్ను శాఖకు అందించాలన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదాయపు పన్ను అధికారులు మానస్ రంజన్, బెహ్రూపాలియన్ హాంగ్ ఆదాయపు పన్ను విధివిధానాలపై, 24క్యూ, టీడీఎస్, TRACES పోర్టల్ ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సురేశ్, జిల్లా ఆదాయపు పన్ను శాఖ అధికారి ప్రకాశ్ శర్మ, ఏటీఓలు అనిల్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూర్యాపేట మార్కెట్ దడువాయిల సంఘం కమిటీ

నినదిస్తున్న నూతన కమిటీ సభ్యులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 6 : దడువాయిలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంపటి గురూజీ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డులోని దడువాయిల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దడువాయిల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూకల మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేగట్టె సందీప్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎల్గూరి శ్రీనివాస్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా పొదిల లింగస్వామి, కోశాధికారిగా అరిగె శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నీరుడు వెంకటరత్నంతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ దడువాయిల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి : డీపఓ

కోదాడ రూరల్, ఫిబ్రవరి 6 : ఎరువుల డీలర్లు, సహకార సంఘాలు ఈ-పాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి రామారావు సూచించారు. మంగళవారం మండలంలోని చిమిర్యాల, నల్లబండ గూడెం, తొగర్రాయి ప్రాథమిక సహకార సంఘాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, కావాల్సిన మేర నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి రజిని, సీఈఓ కృష్ణ ఉన్నారు.

చిమిర్యాల సహకార సంఘం ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న డీపఓ రామారావు

రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా తరుణ్‌రెడ్డి

మఠంపల్లి, ఫిబ్రవరి 6 : గత కొన్నేండ్లుగా రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ అభివృద్ధికి విశేష కృషి చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి తరుణ్‌రెడ్డిని రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కర్ణం గణేశ్ రవికుమార్, ప్రధాన కార్యదర్శి మంగళపల్లి ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నాలుగేండ్లపాటు ఈ పదవిలో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనను సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమించిన వారికి తరుణ్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన

నూతనకల్, ఫిబ్రవరి 6 : ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. ప్రతి మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించే కార్యక్రమానికి మండలం నుంచి మహిళలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారు. మంగళవారం 32 మంది మహిళలు నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా అనుమానం ఉన్న 12 మంది రక్త శాంపిళ్లను జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తారమ్మ, వెంకట్‌రెడ్డి, ఆనంద్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎంపీపీ పద్మావైదేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6 : మేళ్లచెర్వు పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎంపీపీ కొట్టె పద్మావైదేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన ఆశ కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అనంతరం ఆశ కార్యకర్తలు తమ సమస్యలపై ఎంపీపీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ కేజియా, హెల్త్ అసిస్టెంట్ రాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6 : మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం బీసీ గురుకుల విద్యార్థులకు మంగళవారం లయన్స్ క్లబ్ ఆధర్వంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నారాయణ కాలేజీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి సౌజన్యంతో అందించిన స్టడీ మెటీరియల్‌ను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటప్పయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు రామస్వామి, సత్యనారాయణరెడ్డి, విశ్వనాథం, ఆదిరెడ్డి, మహేశ్, ప్రకాశ్, రజిని, ఉపేందర్, రత్నం, కాసీం, మహేశ్, వెంకన్న పాల్గొన్నారు.

పేరబోయినగూడెం పాఠశాలకు గేటు వితరణ

నాగారం, ఫిబ్రవరి 6 : మండలంలోని పేరబోయినగూడెం ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేల విలువైన గేటుతోపాటు రూ.5వేల విలువైన సింగిల్ ఫేజ్ మోటర్‌ను గ్రామానికి చెందిన దొడ్డి ప్రేమయ్య-లక్ష్మి దంపతులు సోమవారం అందజేశారు. వారిని ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తీగుళ్ల స్వరూపాప్రశాంత్, కడారి సత్తయ్య, సెక్రటరీ సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్ సర్వీస్ నంబర్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలి : ఏఈ

అర్వపల్లి, ఫిబ్రవరి 6 : గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్ల సర్వీస్ నంబర్‌కు ఆధార్ లింక్ చేసుకోవాలని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ సిబ్బంది కరెంట్ బిల్లు తీసే సమయంలో ఇంటికి వచ్చినప్పుడు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులు ఇచ్చి సహకరించాలని కోరారు.

గానుగుబండవాసికి ఓయూ డాక్టరేట్

శ్రీనుకు డాక్టరేట్ అందజేస్తున్న గోనానాయక్

గరిడేపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని గానుగుబండకు చెందిన తాళ్ల శ్రీను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు మంగళవారం విలేకరులకు తెలిపారు. తెలుగు విభాగంలో ఆచార్య గోనానాయక్ పర్యవేక్షణలో 'భిక్షుకుంట్ల వారి మౌఖిక సాహిత్యం- సంస్కృతి' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గానూ గౌరవ డాక్టరేట్ అందజేసినట్లు తెలిపారు. శ్రీనును విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులు, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ అభినందించారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

మోతె : మాట్లాడుతున్న ఎంఎస్ కమలమ్మ

మోతె, ఫిబ్రవరి 6 : ఈ నెల 12న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు నులిపురుగు నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 19 ఏండ్ల పిల్లల్లో ఎక్కువగా పరాన్న జీవి ద్వారా సంక్రమించే నులి పురుగులు, కొంకి పురుగులు, ఏలిక పాముల నివారణ కోసం 1 నుంచి 2 ఏండ్ల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19 ఏండ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే 13 నుంచి 18 వరకు 9నెలల నుంచి 5 ఏండ్ల పిల్లలకు విటమిన్-ఏ ద్రావణం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సీత, హెచ్ఎస్ కమలమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గురూజీ

డీడబ్ల్యూఓ జ్యోతిపద్మకు సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 6 : కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంపటి గురూజీ, అధ్యక్షురాలు తంతెనపల్లి సుజాత పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డీడబ్ల్యూఓ జ్యోతిపద్మకు బీఆర్‌టీయూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.24వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కలకోట జ్యోతి, విజయరాణి, సావిత్రి, ఊర్మిళ, సువర్ణ, జానకమ్మ, సునీత, సంధ్య పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ భవన్‌లో నాగారం మండల బీఆర్ఎస్ నాయకులు

నాగారం, ఫిబ్రవరి 6 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండల నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. తరలిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, చిల్లర చంద్రమౌళి, యారాల రాంరెడ్డి, కేశగాని అంజయ్య, ఈదుల కిరణ్‌కుమార్, కూర వెంకన్న, శ్రీనివాస్, యాదగిరి ఉన్నారు.

తూర్పుగూడెంలో దొంగల హల్‌చల్

- ఏడు ఇండ్లల్లో చోరీ
- 3తులాల బంగారం, 4కిలోల వెండి అపహరణ

తూర్పుగూడెంలో విచారణ చేస్తున్న ఎస్ఐ ఏడుకొండల్

తుంగతుర్తి, ఫిబ్రవరి 6 : మండలంలోని తూర్పుగూడెంలో ఏకకాలంలో ఏడు ఇండ్లలో జరిగిన దొంగతనాలతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి గ్రామంలో పలు ఇండ్లల్లో చొరబడి బంగారం, వెండి అపహరించుకెళ్లారు. మంగళవారం గ్రామస్తులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఏడుకొండల్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. సంకినేని రామచందర్‌రావు ఇంట్లో తులన్నర బంగారం, మూడు కిలోల వెండి, రూ.20వేల నగదు, గట్టు జటదాంబ ఇంట్లో 20 తులాల వెండి కడియాలు, ముత్యం కాంతమ్మ ఇంట్లో పావుతులం బంగారం, 30 తులాల వెండి, రూ.10వేల నగదు, గునిగంటి కమలమ్మ ఇంట్లో 22 తులాల వెండి పట్టా గొలుసులు, రూ.15 వేల నగదు దొంగిలించగా హజారి జగ్గయ్య, సంకినేని వెంకటేశ్వర్‌రావు, లింగంపల్లి కలమ్మ ఇంట్లో దొంగతనాలు జరిగినట్లు ఎస్ఐ వివరించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- ఎంపీపీ జ్యోతీమధుబాబు

నడిగూడెం, ఫిబ్రవరి 6 : వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి నుంచి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యాతాకుల జ్యోతిమధుబాబు

వెంకట్‌రెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

సూర్యాపేట రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని ఎండ్లపల్లికి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొల్లు వెంకట్‌రెడ్డి మృతి చెందాడు. మంగళవారం ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి నివాళి అర్పించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు నంద్యాల దయాకర్‌రెడ్డి ఉన్నారు.

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా

నేరేడుచర్ల, ఫిబ్రవరి 6 : మండలంలోని చిల్లేపల్లి సహకార సంఘం చైర్మన్ అనంత శ్రీనివాస్‌గౌడ్ తన పదవికి రాజీనామా చేయగా, జిల్లా సహకార సంఘం అధికారి శ్రీధర్ ఆమోదిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ గౌడ్‌పై జనవరి 30న ఆ సంఘం డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయినప్పటికీ రాజీనామా చేయడం గమనార్హం.

వెంకట్రామ్‌పురంలో పశువైద్య శిబిరం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6 : మై హోం సిమెంట్ ఇండస్ట్రీస్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకట్రామ్‌పురంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావుతో కలిసి జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాస్‌రావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సతోపాటు పెరటి కోళ్లు, పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఉషారాణి, మైహోం జీఎం నాగేశ్వర్‌రావు, జగన్నాథరావు, రత్నం, శ్రీనివాస్‌రావు, నాయకులు వీరనాగిరెడ్డి, సైదిరెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

- సేవాలాల్ సేవా సంఘం జిల్లా నాయకుడు కోటేశ్‌నాయక్

బొడ్రాయిబజార్ : అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు